## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ 21వ శతాబ్దంలో గొప్ప దృక్పథం కలిగిన దేశంగా భారత్ ఆవిర్భవిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ పులివెందుల అభివృద్ధి రాష్ట్రానికే ఆదర్శమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.
- ❖ విద్యుత్ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీల భారం లేకుండా కొత్త టారిఫ్ ను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ సి.వి. నాగార్జున రెడ్డి తెలిపారు.
- ❖ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వాల్తేర్ డివిజన్ పరిధిలో రెండు వందేభారత్ రైళ్లు రేపు ప్రారంభమవుతున్నాయి.

=====================

21వ శతాబ్దంలో గొప్ప దృక్పథం కలిగిన దేశంగా భారత్ ఆవిర్భవిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. హర్యానాలోని గురుగ్రామ్ నుంచి ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా దేశవ్యాప్తంగా లక్ష కోట్ల విలువైన 112 జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలోని సుమారు 29 వేల 395 కోట్ల రూపాయలతో ఒక వేయి 134 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలను ప్రధాని ఈ సందర్భంగా చేశారు. ఇందులో ఆనందపురం – పెందుర్తి అనకాపల్లి సెక్షన్ జాతీయ రహదారి – 16ని కూడా ప్రారంభించారు. అలాగే, 9.6 కిలోమీటర్ల పొడవు గల ఆరు లైన్ల అర్బన్ ఎక్స్ టెన్షన్ రోడ్లు ఉన్నాయి. బెంగళూరు-కడప- విజయవాడ ఎక్స్ ప్రెస్ వే కూడా ప్రధాని ప్రారంభించిన కార్యక్రమాలలో ఉన్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, రేపటి భారతదేశానికి సరికొత్త మౌలిక సదుపాయాలుగా వీటిని పేర్కొన్నారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

=====================

పులివెందుల అభివృద్ధి రాష్ట్రానికే ఆదర్శమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లాలో ఒక్క రోజు పర్యటనలో భాగంగా ఈ రోజు పులివెందులకు వచ్చిన ఆయన నియోజకవర్గ పరిధిలో 861.84 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన పలు నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి

అనేది అనంతం పేర్కొన్నారు. కాలానుగుణంగా అభివృద్ధి కొనసాగుతూనే ఉంటుందని ముఖ్యమంత్రి తెలియజేసారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ భవనాలకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. అలాగే, బనానా ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్‌ను ప్రారంభించారు.
డీఐపిఆర్వో , వైఎస్ఆర్ జిల్లా

=====================

రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీల భారం లేకుండా కొత్త టారిఫ్ ను రూపొందించడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ సి.వి. నాగార్జున రెడ్డి తెలిపారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర జలవనరుల నిర్వహణ రైతుశిక్షణ కేంద్రంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్ ని ఆయన ఈ రోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఏడాది విద్యుత్ ఛార్జీల పెంపు లేదని స్పష్టం చేశారు. వార్షిక ఆదాయ అవసరాల నిమిత్తం ఎస్పిడిసిఎల్, సిపిడిసిఎల్, ఈపిడిసిఎల్ ల కోసం 56 వేల 501.81 కోట్ల రూపాయలకు కమిషన్ ఆమోదం తెలిపిందని అన్నారు.

విరామం

=====================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వాల్తేర్ డివిజన్ పరిధిలో రేపు
విశాఖపట్నం-పూరీ ,విశాఖపట్నం-సికింద్రాబాద్ ల మధ్య మరో రెండు వందేభారత్ రైళ్లు ప్రారంభమవుతున్నట్లు వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. రేపు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 9 గంటలకు పూరీ-విశాఖపట్నం వందే భారత్ రైలు ను నడుపుతున్నట్లు డిఆర్ఎమ్ తెలిపారు. వీటితోపాటు కొత్తవలస-కోరాపుట్ సెక్షన్లో 123 కోట్ల రూపాయలతో డబ్లింగ్ పనులను జాతికి అంకితం చేస్తారని తెలిపారు. అలాగే, విజయనగరం-టిట్లాగఢ్ థర్డ్ లైన్ ప్రాజెక్ట్‌లో పూర్తి చేసిన భాగాలను కూడా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కోరాపుట్-రాయగడ లైన్లలో రెండు డబ్లింగ్ ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారని వివరించారు.

=====================

సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి రాజేందర్ చౌదరి ఈ రోజు విజయవాడలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో ఆంధ్రప్రదేశ్ అదనపు డైరెక్టర్ జనరల్ గా బాధ్యతలు స్వీకరించారు. రాజేందర్ చౌదరి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ 1997 బ్యాచ్ కి చెందిన వారు. ఆయన ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆహారం ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖలలో వివిధ హోదాలలో పనిచేశారు.

=====================

రాష్ట్ర సమాచార కమీషన్ కు కొత్తగా నియమించబడిన ముగ్గురు కమీషనర్లు చావలి సునీల్, రెహానా బేగం, అల్లారెడ్డి ఉదయ భాస్కర్ రెడ్డిలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అమరావతిలోని సీఎస్ క్యాంప్ కార్యాలయంలో ఈరోజు ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమీషన్ ముఖ్య సమాచార కమిషనర్ మెహబూబ్ భాషా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

=====================

జాతీయ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి, ఎన్‌బిసిఎఫ్‌డిసి, ఎన్ఏఎంఇఎస్‌టిఇ పథకాల లబ్దిదారులతో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 13న ప్రధానమంత్రి నరేంద్ర మోడి దేశవ్యాప్తంగా ముఖాముఖి నిర్వహించనున్నట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కేంద్రం నుంచి నోడల్ అధికారి పాల్గొంటారని తెలిపారు.

=====================

రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలలో సుందరీకరణ పనులు చేపడుతున్నట్లుగా విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా పెనుమూరు క్రాస్ వద్ద అటవీశాఖ ఏర్పాటు చేసిన నీవా నగర వనాన్ని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డప్పతో కలిసి మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానమైన పట్టణాలలో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తున్నట్లుగా వెల్లడించారు.

=======================

లక్ పతి దీదీ పథకం ద్వారా జిల్లాలో 21 స్వయం సహాయక సంఘాలకు రూ.30 లక్షల రూపాయల రుణాలను, 1188 స్వయం సహాయక సంఘాలకు 113 కోట్ల రూపాయల బ్యాంక్ లింకేజ్ రుణాలను అందించడం జరిగిందనీ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కే. మాధవీలత అన్నారు. మహిళా ఆర్థిక సాధికారతే ప్రధాన లక్ష్యంగా "పి ఎమ్ లక్ పతి దీదీ" పథకం ద్వారా లక్ష కంటే తక్కువ ఆదాయం కలిగిన మహిళలకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు.

=====================

స్పందన ద్వారా అర్జీదారుల నుంచి స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో ఈ రోజు జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వయంగా కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలుతో పాటు పలు ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. స్పందన వినతులను వారం రోజులలోగా పరిష్కరిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

=====================

=====================